క్లుప్తంగా

నేడు ఉల్లి రైతులకు వర్క్‌షాపు

కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లిలో వాల్యు యాడెడ్ ఉత్పత్తులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ నెల 10వ తేదీన(నేడు) కర్నూలులో భారీ ఎత్తున వర్క్‌షాపు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే ఉల్లి సాగు అవుతోంది. అందువల్ల ప్రత్యేకంగా కర్నూలులోని కొత్తబ బస్టాండు సమీపంలోని త్రిగుణ క్లాక్‌లో ఉదయం 11 గంటలకు ఉద్యాన శాఖ- ఆంధ్రప్రదేశ్ మహిళ అభివృద్ధి సొసైటీ(ఏపీ ఎంఎఎస్) సంయుక్తంగా వర్క్‌షాపు నిర్వహించనున్నాయి. ఈ వర్క్‌షాపునకు వివిధ రాష్ట్రాల నుంచి ఉల్లి శాస్త్రవేత్తలు హాజరు కానున్నారు. ఉల్లి సాగులో ఉన్న లోపాలను సవరించుకోవడం, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు అవశ్యకత, గ్రేడింగ్, మార్కెటింగ్ వంటి వాటిపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించనున్నారు.

13న ఎస్‌ఐ నమూన పరీక్ష

కర్నూలు(సెంట్రల్): ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన ఎస్‌ఐ నమూన పరీక్షను నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి తెలిపారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ..పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు నమూనా పరీక్షలను రాయడం ద్వారా మెలకువలను తెలుసుకొని ప్రధాన పరీక్షలో సమయం వృథా కాకుండా ఉండే అవకాశం ఉంటుందన్నారు. అంతేకాక వారిలో భయాందోళన తొలగి మానసికంగా సిద్ధమవ్వచ్చన్నారు. ఈ పరీక్ష రాయదలుచుకున్న అభ్యర్థులు 9703177579, 9912470432 నంబర్లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాబయ్య, బీసన్న, చంటి, చిన్న, రాజు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

కర్నూలు(అర్బన్): నగరంలోని ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధి జమ్మిచెట్టు ప్రాంతంలో మట్కా చీటీలు, సారాయి బాటిళ్లు అమ్ముతుండటంతో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక చిత్తారి వీధికి చెందిన సయ్యద్ హబీబుల్లా, ఎస్.నాగప్ప వీధికి చెందిన చిట్యూరు బాలస్వామి అనే వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

ఆర్‌యూ ప్రొఫెసర్ మృతి

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్శిటీలో స్టాటస్టిక్స్ విభాగం ప్రొఫెసర్ డా.కె శ్రీనివాసరావు అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. వైఎస్‌ఆర్ జిల్లాకు చెందిన ఆయన 1992లో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం పీజీ సెంటర్ (ప్రస్తుతం ఆర్‌యూ)లో సహాయక ఆచార్యులుగా విధుల్లో చేరారు. ఆ తరువాత ఆచార్యులుగా పదోన్నతి పొందిన 1998-99, 2007-08 విద్యా సంవత్సరాల్లో అతిథి ఆచార్యులుగా విదేశాలకు వెళ్లి వచ్చారు. 2008లో రాయలసీమ యూనివర్శిటీ ఏర్పాటు అయిన తరువాత ఆచార్యులుగా స్టాటస్టిక్స్ హెచ్‌ఓడీగాను, యూనివర్శిటీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పని చేశారు. అదే విధంగా అడ్మిషన్ డైరెక్టర్‌గాను, డిస్టెన్స్ విభాగం డైరెక్టర్‌గా పని చేస్తూ 6 నెలల క్రితం అనారోగ్యం కారణంగా సెలవులు పెట్టి చికిత్స తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే కోలుకోలేక మృతి చెందారు. ఈయన భార్య క్రిష్ణకుమారి 2021లో మరణించారు. కొడుకు, కూతురు ఉన్నారు. యూనివర్శిటీ ఆచార్యులు మరణించిన విషయం తెలుసుకున్న వర్సిటీ సిబ్బంది ఆయన భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పర్యవేక్షణ తప్పనిసరి

కర్నూలు (టౌన్): నగరంలో పారిశుద్ధ్యంపై పర్యవేక్షణ తప్పని సరిగా ఉండాలని నగరపాలక డిప్యూటీ కమిషనర్ రమాదేవి అన్నారు. గురువారం స్థానిక 13వ వార్డు పరిధిలోని ప్రకాష్‌నగర్, ఆనంద్ థియేటర్, ముజఫర్‌నగర్, ఇందిరమ్మ కట్ట, కల్లూరు ప్రాంతాలలో డిప్యూటీ కమిషనర్ పారిశుద్ధ్యంపై తనిఖీ నిర్వహించారు. స్థానికంగా కాలనీ వాసులతో పాటు సచివాలయాల వెల్ఫేర్ కార్యదర్శులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.

'బోయ శ్రీరాములుపై హత్య కేసు నమోదు చేయాలి'

కర్నూలు(అర్బన్): ఆలూరు నియోజకవర్గం ఆస్పరి మండలం అట్టికల్లు గ్రామానికి చెందిన కురువ రాజేశ్వరి ఆత్మహత్య చేసుకునేందుకు కారకుడైన బోయ శ్రీరాములు (శీను)పై హత్య కేసు నమోదు చేయాలని కురువ సంఘం నేతలు కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు పత్తికొండ శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి మాట్లాడుతూ.. ఈ నెల 1వ తేదీన కురువ రాజేశ్వరి పొలంలో పనిచేస్తుండగా, శ్రీరాములు దుర్మార్గంగా ప్రవర్తించడంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురై పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకోగా, కర్నూలు ఆసుపత్రికి తీసుకు వచ్చారన్నారు. చికిత్స పొందుతు మృతి చెందిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘం నేతలు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం

కర్నూలు(సెంట్రల్): ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేవీ నారాయణ, జి.రామకృష్ణ విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపుల్లో కోత పెట్టడం, ప్రత్యేక హోదా తదితర విషయాలు పట్టించుకోక పోవడం బాధాకరం అన్నారు. గురువారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో హెడ్ పోస్టాఫీసు ఎదుట ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, లింగన్న, జి.ఆంజనేయులు, ఎ.కృష్ణ, పి.బాలపీర పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- 35వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'


చింతలముని నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలోని పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 35 వార్డు 89వ వార్డు సచివాలయం పరిధిలో అయ్యప్ప నగర్, చింతలముని నగర్‌లలో స్థానిక కార్పొరేటర్ సాపురు మాధురి, వార్డు ఇన్‌చార్జ్ సాపురు వీరయ్య ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ తిరుగుతూ అందరిని అప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి వివరించారు. లబ్ధిదారులకు సంక్షేమ క్యాలెండర్లను అందజేశారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకే మీ మద్దకు వచ్చామని, ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సకాలంలో పథకాలు అందిస్తున్నారా? లేదా? ఆరా తీశారు. ప్రజలు విన్నవించుకున్న సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కులాలకు, రాజకీయాలకు, వర్గాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అర్హులై ఉండి పథకాలు రాని ఉంటే తనకు తెలియజేయాలన్నారు. గత టీడీపీ పాలనకు నేడు ముఖ్యమంత్రి జగన్ అందిస్తున్న అవినీతి రహిత పాలనకు తేడాను గమనించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సందేపోగు శివ, శివారెడ్డి, సుబాన్, వీరేష్, వలి, ఆనంద్, ప్రసాద్, పలువురు కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ముఖ్యమంత్రి సహాయ నిధి కింద నియోజకవర్గంలోని మొత్తం 19 మందికి మంజూరైన రూ.23,21,000 చెక్కులను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్వగృహంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు.

సీఎంతో హఫీజ్ ఖాన్



కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. కర్నూలు నగరంలో రూ.16.23 కోట్లతో రహదారుల విస్తరణ అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయడంతో గురువారం సీఎం కార్యాలయంలో ఆయన కలసి కృతజ్ఞతలు తెలిపారు. క్యాబినెట్ సమావేశంలో నేషనల్ లా యూనివర్శిటీ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలపడంతో సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. అలాగే కర్నూలు నగర అభివృద్ధి గురించి, పలు అంశాల గురించి సీఎంతో చర్చించారు.

ప్రసాద్... నీ సంకల్పం అందరికీ స్ఫూర్తి


సైకిల్ యాత్ర చేస్తున్న నెయ్యల ప్రసాద్‌తో మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య

కల్లూరు: ప్రసాద్... నీ సంకల్పం, పోరాట పటిమ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి అంటూ నగర మేయర్ బీవై రామయ్య అభివర్ణించారు. ఏపీకి ప్రత్యేక హోదా, విశాఖపట్నానికి రైల్వే జోన్ ఇవ్వాలనే డిమాండ్‌తో ఇచ్ఛాపురానికి చెందిన నెయ్యల ప్రసాద్ అనే దివ్యాంగుడు 2018 డిసెంబర్‌లో సైకిల్ యాత్ర ప్రారంభించారు. రాష్ట్రంలోని మొత్తం 12 ఉమ్మడి జిల్లాలోని 192 మండలాల్లో ప్రజా ప్రతినిధులను, నాయకులను కలిసినట్లు ప్రసాద్ పేర్కొన్నారు. మధ్యలో కోవిడ్ వలన కొన్నాళ్లు వాయిదా పడిన తిరిగి మళ్లీ సైకిల్ యాత్ర మొదలు పెట్టారు. గురువారం నగర మేయర్ రామయ్యను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌కు మేయర్ సంఘీభావం తెలిపారు. మేయర్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వే జోన్ కోసం వైఎస్సార్‌సీపీ ఆది నుంచి పోరాటం చేస్తుందన్నారు. రాష్ట్ర విభజన హామీలన్నీ నెరవేర్చాలని కేంద్రంపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఫలితంగా గత ఏడాదిలో హామీల అమలుకు కేంద్రం ఒక కమిటీ వేసిందని గుర్తు చేశారు. ప్రస్తుతం పార్లమెంట్‌లో జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో ఎంపీ విజయసాయిరెడ్డి గళం విప్పారని తెలిపారు. నాడు కాంగ్రెస్, నేడు బీజేపీల ధోరణిని వైఎస్సార్‌సీపీ ఎంపీలు పార్లమెంట్ వేదికగా ఎండగడుతున్నారన్నారు.

అప్పర్‌భద్రను అడ్డుకుంటాం

కర్నూలు(సెంట్రల్): కర్ణాటక ప్రభుత్వం నిర్మించే అప్పర్ భద్ర ప్రాజెక్టును అడ్డుకుంటామని బీజేపీ నేత బైరెడ్డి రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే రాయలసీమకు కేటాయించిన నికర జలాలు రావడంలేదని, ఆ ప్రాజెక్టు వస్తే ఇక్కడి కేసీ కెనాల్, ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీ, హంద్రీనీవా ప్రాజెక్టులకు చుక్కనీరు రాదన్నారు. ఈ ప్రాజెక్టును అడ్డుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలు ఏకం కావాలన్నారు.

రీసర్వేను వేగవంతం చేయాలి

- జిల్లా అధికారులకు సీసీఎల్ఏ కమిషనర్ ఆదేశం

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని సీసీఎల్ఏ కమిషనర్ జి.సాయిప్రసాద్ ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి సీసీఎల్ఏ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రీసర్వే, ఇంటి పట్టాలు, ఇతర రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రీసర్వేలో భాగంగా చేపట్టిన గ్రౌండ్ ట్రూతింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. భూ హక్కు పత్రాల పంపిణీని వెంటనే పూరి చేయాలన్నారు. ఇంటి స్థలం కోసం ఇచ్చిన దరఖాస్తులకు 90 రోజుల్లో పరిష్కారం చూపాలన్నారు. కాగా, కర్నూలు జిల్లాలో ఇప్పటికే 68 గ్రామాల్లో సర్వే పూర్తి కాగా, మరో 404 గ్రామాల్లో క్షేత్రస్థాయి పీఓఎల్ ఆర్ ప్రక్రియను మొదలు పెట్టామని కలెక్టర్ పి.కోటేశ్వరరావు సీసీఎల్ఏ కమిషనర్ జి.సాయిప్రసాద్‌కు వివరించారు. కార్యక్రమంలో జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'జవా'.. పెద్ద దగా

- ఉద్యోగాల పేరిట 74 మంది నిరుద్యోగులకు జవా మ్యాట్రిక్స్ కుచ్చు టోపీ
- సెక్యూరిటీ డిపాజిట్ కింద ఒక్కొక్కరి నుంచి రూ.2 నుంచి 3 లక్షల వరకు వసూలు
- కలెక్టరేట్ ఎదుట బాధితుల ఆందోళన


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బాధితులు

కర్నూలు(సెంట్రల్): నిరుద్యోగులకు జవా మ్యాట్రిక్స్ అనే కంపెనీ కుచ్చు టోపీ పెట్టింది. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఉద్యోగాలంటూ సెక్యూరిటీ డిపాజిట్ పేరిట భారీగా వసూలు చేసి ముఖం చాటేసింది. ఐదు నెలలుగా ఉద్యోగం చేస్తున్నా జీతాలు రాకపోవడంతో దగా పడినట్లు అభ్యర్థులు గ్రహించారు. దీంతో గురువారం కలెక్టరేట్ ఎదుట తమ డబ్బులు తమకు ఇప్పించాలని ధర్నాకు దిగారు.

ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 1983 నుంచి మాత్రమే ఆన్‌లైన్ డాక్యుమెంట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ క్రమంలో అంతకుముందు డాక్యుమెంట్లను కూడా ఆన్‌లైన్‌లో చూసుకోవడం, తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా పాత డాక్యుమెంట్లను స్కానింగ్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని నిర్ణయించింది. ఈ బాధ్యతను రైటర్స్ అనే సంస్థకు అప్పగించింది. జవా మ్యాట్రిక్స్ రైటర్ సంస్థ నుంచి సబ్ కాంట్రాక్టర్‌గా ఎంట్రైంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉద్యోగాల పేరిట నిరుద్యోగులకు వల వేసింది. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.2 నుంచి 3 లక్షల వరకు సెక్యూరిటీ డిపాజిట్‌గా వసూలు చేసింది. ఉద్యోగం చేస్తున్న సమయంలో నెలకు రూ.18 వేలు జీతంతోపాటు అలవెన్స్‌లు ఇస్తామని చెప్పింది. అయితే ఎన్నో ఆశలతో డబ్బులు చెల్లించి ఉద్యోగంలో చేరిన వారికి జీతాలు పడలేదు. రెండు, మూడు నెలల వరకు కొంచెం ఇబ్బందిగా ఉంటుందని, ఆ తరువాత జీతాలు చెల్లిస్తామని కంపెనీ నిర్వాహకులు చెప్పడంతో ఒకే అనుకున్నారు. అయితే 5 నెలలు గడిచినా వారికి జీతాలు రాకపోవడంతో నిలదీస్తే సమాధానం చెప్పేనాథుడు లేకపోవడంతో మోసపోయామని గ్రహించారు. జిల్లాలో దాదాపు 74 మంది నుంచి జవా మ్యాట్రిక్స్ డబ్బులు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో అభ్యర్థులు తాము కట్టించిన డబ్బును తిరిగి ఇప్పించాలని కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు.

రూ.2.50 లక్షలు కట్టించుకున్నారు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉద్యోగం పేరుతో జవా మ్యాట్రిక్స్ కంపెనీ మోసం చేసింది. సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.2.50 లక్షలు కట్టించుకున్నారు. నెలకు రూ.18 వేలు జీతమని చెప్పారు. ఐదు నెలలు గడిచినా రూపాయి కూడా జీతం రూపంలో ఇవ్వలేదు. ఎవరూ పలకడంలేదు. – సతీష్, నంద్యాల

ప్రభుత్వమే న్యాయం చేయాలి



నేను సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.2.50 లక్షలు కట్టాను. మాది కర్నూలు అయితే ఓర్వకల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉద్యోగమన్నారు. అక్కడ ఐదు నెలలుగా పనిచేస్తున్నా జీతం రావడంలేదు. జిల్లాలో దాదాపు 74 మందిని జవా మ్యాట్రిక్స్ తీసుకుంది. అందరి దగ్గర రెండు లక్షల నుంచి మూడు లక్షల వరకు సేకరించింది. మాకు ప్రభుత్వమే స్పందించి వారితో డబ్బులు వెనక్కి ఇప్పించాలి. –రాజు, కర్నూలు

అప్పర్‌భద్రతో సీమకు తీవ్ర అన్యాయం

- పార్లమెంట్‌లో ఎంపీల ప్రస్తావన హర్షణీయం
- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి


సంఘీభావ లేఖను అందిస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు(అర్బన్): కర్ణాటక రాష్ట్రంలో నిర్మిస్తున్న అప్పర్‌భద్ర ప్రాజెక్టు వల్ల రాయలసీమలోని ప్రాజెక్టులకు, ప్రత్యేకించి కర్నూలు జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఆయన జెడ్పీలోని తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని నీటి ప్రాజెక్టులపై కర్నూలు, నంద్యాల పార్లమెంట్ సభ్యులు డా.ఎస్ సంజీవ్‌కుమార్, పోచా బ్రహ్మానందరెడ్డి ఈ నెల 8వ తేదీన పార్లమెంట్‌లో ప్రస్తావించడం హర్షణీయమన్నారు. ఎంపీలు ప్రస్తావించిన విధంగా ... కేంద్ర ప్రభుత్వం గుండ్రేవుల ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి కరువు, కాటకాలకు నిలయమైన కర్నూలును సస్యశ్యామలం చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు జాతీయ గుర్తింపు లభిస్తే నిధులు పుష్కలంగా విడుదలయ్యే అవకాశం ఉన్నందున ప్రాజెక్టు త్వరగా పూర్తి అవుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే మూడు రాష్ట్రాల (కర్ణాటక, తెలంగాణ, ఏపీ) మధ్య వివాదం తలెత్తకుండా కేంద్ర జలశక్తి శాఖ పరిష్కారం చూపుతుందన్నారు. బచావత్ ట్రిబ్యూనల్ సూచన మేరకు వృథా జలాలను నిల్వ ఉంచేందుకు వీలుగా గుండ్రేవుల వద్ద క్యారీ ఓవర్ రిజర్వాయర్‌ను కూడా నిర్మించాల్సి ఉందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలుపుతు కృష్ణా నదిపై నిర్మించనున్న ఐకానిక్ బ్రిడ్జీని శ్రీశైలం బ్యాక్ వాటర్‌పై బ్యారేజ్ కమ్ ఐకానిక్ బ్రిడ్జీగా నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రాయలసీమలోని నీటి ప్రాజెక్టులకు, ముఖ్యంగా కర్నూలు జిల్లాలో సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా వివిధ ప్రాంతాల్లో రిజర్వాయర్లు నిర్మించాలన్నారు.

దివ్యాంగుని పట్టుదల స్ఫూర్తి కావాలి

కర్నూలు(అర్బన్): ఏపీకి ప్రత్యేక హోదా, విశాఖ పట్టణానికి రైల్వే జోన్ ఇవ్వాలనే డిమాండ్‌పై ఇచ్ఛాపురానికి చెందిన నెయ్యల ప్రసాద్ అనే దివ్యాంగుడు చేపట్టిన సైకిల్ యాత్ర ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపాలని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. సైకిల్ యాత్ర చేపట్టిన ప్రసాద్ గురువారం జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ దివ్యాంగుడైన ప్రసాద్ ధృడ సంకల్పం, పట్టుదలతో చేస్తున్న యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఇప్పటికే ఏపీకి ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వే జోన్ కావాలని తమ ప్రభుత్వం వివిధ సందర్భాల్లో కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తూనే ఉందన్నారు. యాత్రికుడు ప్రసాద్ మాట్లాడుతూ.. 2018 డిసెంబర్ నెలలో సైకిల్ యాత్ర ప్రారంభించానని, వివిధ జిల్లాల పర్యటనలో అనేక మంది ప్రజా ప్రతినిధులను కలుస్తు వారి నుంచి ఉద్యమ సంఘీభావంగా లేఖలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలోనే జెడ్పీ చైర్మన్ యాత్రకు సంఘీభావంగా లేఖను అందించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి ఉన్నారు.

తీరనున్న 'గడప గడప' సమస్యలు

- 28 అభివృద్ధి పనులకు రూ.1.30 కోట్లు విడుదల
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

కర్నూలు (టౌన్): క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. ఇందులో భాగంగా కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, స్థానిక సమస్యలు తెలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయా వార్డు సచివాలయాల పరిధిలో గుర్తించిన 28 పనులకు రూ.1.30 కోట్లు విడుదల చేయాలంటూ ఇప్పటికే నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కలెక్టర్ కోటేశ్వరరావు కర్నూలు నియోజకవర్గం పరిధిలోని అభివృద్ధి పనులకు సంబంధించి పరిపాలన అనుమతులు ఇచ్చారు. దీంతో త్వరలోనే ఈ పనులు చేపడుతున్నట్లు ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలు తీరనున్నాయి.

చేపట్టనున్న అభివృద్ధి పనుల్లో కొన్ని వివరాలు

- 9వ వార్డులో ఇంటి నంబర్ 8/179 నుంచి ఇంటి నంబర్ 26/302 వరకు రూ. 5 లక్షలు వెచ్చించి సీసీ డ్రైన్ ఏర్పాటు చేయనున్నారు.
- కవాడీ వీధిలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు, వన్ టౌన్ మెయిన్ బజార్ వద్ద రూ.5 లక్షలతో సీసీ కల్వర్టు నిర్మాణం, బుధవార పేటలో రూ.5 లక్షలతో సీసీ డ్రైన్, కల్వర్టు నిర్మాణం చేపట్టనున్నారు.
- బుధవారపేట పరిధిలోని చైతన్య పాఠశాల సమీపంలో రూ.2.70 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణం, ఇదే ఏరియాలోని మాబూ సుబానీ మసీదు వద్ద రూ.5 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే అక్కడే రూ.2.30 లక్షలు వెచ్చించి హెచ్‌డీపీఈ పైపులైన్ ఏర్పాటు చేయనున్నారు.
- 14 వ వార్డు పరిధిలోని హబీబ్ ముబారక్ నగర్‌లో రూ.3.40 లక్షలతో సీసీ రోడ్డు, రూ.3.20 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణాలను చేపట్టనున్నారు

మత్స్యకారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు(అర్బన్): జాతీయ మత్స్యకారుల సంఘం నగర కార్యవర్గాన్ని నూతనంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బెస్త శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక బీ క్యాంప్‌లోని బీసీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సంఘం నగర గౌరవాధ్యక్షులుగా జలగరి వెంకటేశ్వర్లు, అధ్యక్షులుగా గ్యాస్ బెస్త శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ఎద్దుల వెంకటేష్‌ను ఎన్నుకున్నామన్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా బెస్త కమల, బెస్త సత్యనారాయణమ్మ, కార్యదర్శులుగా టీకే రాజేశ్వరి, బీ భాస్కర్, కోశాధికారిగా కే గోపాల్‌రాజా, సహాయ కార్యదర్శిగా టీ నందకిషోర్, కార్యవర్గ సభ్యులుగా టీ కేశవ్‌కుమార్‌ను ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు తిరుపాలు మాట్లాడుతూ బెస్తలు ఐక్యంగా ఉండాలని, త్వరలోనే జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాల్లో కమిటీలు వేసి సంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి నియామక పత్రాలను అందించారు.

అమృత్ సరోవర్ చెరువులపై దృష్టి సారించండి

- జూలై చివరిలోపు పనులు పూర్తి కావాలి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఎంపిక చేసిన చెరువులను అమృత్ సరోవర్‌లుగా సమగ్రంగా అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు. గురువారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ఏపీడీలు, ఏపీవోలతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ... జిల్లాలో 75 చెరువులను అమృత్ సరోవర్‌లుగా మార్చాలన్నదే లక్ష్యమని, ఇప్పటి వరకు 29 చెరువుల అభివృద్ధి పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన 51 చెరువులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ చెరువుల పనులు జూలై చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. చెరువుల అభివృద్ధికి మెటీరియల్ కాంపోనెంటు కింద వివిధ పనులు చేపట్టేందుకు రూ.2 లక్షల వరకు ఖర్చు చేయవచ్చని తెలిపారు. గ్రామ పంచాయతీ నిధులను చెరువు సుందరీకరణ పనులకు వినియోగించవచ్చని సూచించారు. ఉపాధి పనులకు ప్రతి రోజు 65వేల మంది వరకు కూలీలు హాజరవుతున్నారని, ఈ సంఖ్యను లక్షకు పెంచాలన్నారు. ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలకు నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారానే 100 శాతం హాజరు వేయాలని పేర్కొన్నారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో పరిపాలన అధికారి నాగేశ్వరరావు, ఎంఅండ్ ఈ భాస్కరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌విహార్ మీదుగా బస్సులను నడపాలి

కర్నూలు(సెంట్రల్): ఆర్టీసీ బస్సులను రాజ్‌విహార్ మీదుగానే నడపాలని కర్నూలుజిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దాదాపు 40 రోజుల నుంచి బస్టాండ్ నుంచి కర్నూలు నగరంలోకి బస్సులను పంపకుండా బళ్లారి చౌరస్తా మీదుగా బయటకు పంపుతున్నారన్నారు. ఇలా వెళ్లడం ద్వారా ఆర్టీసీకి రోజుకు రూ.10 లక్షల నష్టం వస్తున్నా పట్టించుకోకుండా, ప్రజల ఇబ్బందులు చూడకుండా ఉండటం అన్యాయమన్నారు. బస్సులు నగరం బయటి నుంచి వెళ్తుండడంతో ఉద్యోగులు, విద్యార్థులకు ఆటో చార్జీలు అదనపు భారంగా మారయన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు జాన్ విల్సన్ బతుకన్న, సత్యనారాయణ గుప్తా, బజారన్న, అమరేందర్‌రెడ్డి, సజ్జాద్ హుస్సేన్, ప్రమీళ పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ఓ వరం

కర్నూలు(హాస్పిటల్): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఫ్యామిలి ఫిజీషియన్ విధానం ఓ వరమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. గురువారం ఆయన ఓర్వకల్లు మండలంలోని నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఫ్యామిలి ఫిజీషియన్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, ఆరోగ్యశ్రీ చికిత్సలు చేయించుకున్నవారు, గర్భిణీలు, బాలింతలు పరీక్షల కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. నిర్దేశిత తేదిల్లో ఇంటి వద్దకే వైద్యులు వచ్చి పరీక్షలు నిర్వహించి, వారికి మందులు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన గ్రామంలో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం పొందిన గృహాలకు వెళ్లి వారి ఆరోగ్యపరిస్థితులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో నన్నూరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగరాజు, పీహెచ్ఎన్ విజయలక్ష్మి, హెచ్ఎస్ అన్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పి సంధ్యారాణి, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

కర్నూలు: కర్నూలు శివారులోని బి.తాండ్రపాడు వద్ద ఉన్న కర్నూలు అర్బన్ తాలూకా పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. ఫిబ్రవరి 11వ తేదీన జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన కక్షిదారులు ఇరుపక్షాల వారికి ఎస్పీ కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామాల సందర్శన(విలేజ్ విజిట్)ను పెంచాలని పోలీసు అధికారులకు ఎస్పీ సూచించారు.

15లోగా వివరాలు పంపండి

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ పరిధిలోని వివిధ ప్రభుత్వ శాఖలు, ఆయా విభాగాల్లో పని చేస్తున్న నాల్గవ తరగతి సిబ్బంది (అటెండర్, స్వీపర్, వాచ్‌మెన్) వివరాలను హెచ్‌ఓడీలు ఈ నెల 15 లోగా తమ కార్యాలయానికి పంపించాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఇ.వి.సుబ్బారెడ్డి కోరారు. జెడ్పీ సీఈఓ మౌఖిక ఆదేశాల మేరకు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పనిచేస్తూ రెండు సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న సిబ్బంది విద్యార్హతలు, ఇతర వివరాలను పరిపాలన సౌలభ్యంలో భాగంగా జతపరచిన ప్రొఫార్మాలో సంబంధిత డీడీఓల సంతకంతో పంపించాలన్నారు.

విశ్రాంత ఉద్యోగి దాతృత్వం


విరాళం అందజేసిన చల్లా జయశంకర్‌రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు వైద్య ఆరోగ్య శాఖకు చెందిన విశ్రాంత ఎంపీహెచ్ఈవో చల్లా జయశంకర్‌రెడ్డి రూ.20 వేల విరాళాన్ని అందజేసి దాతృత్వం చాటుకున్నారు. కర్నూలు అబ్బాస్ నగర్‌లో ఉన్న ఈ అసోసియేషన్ చేపడుతున్న సేవా కార్యాక్రమాలకు ఆకర్షితులై, మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు వీలుగా విరాళాన్ని అందజేశారని అధ్యక్షుడు ఎస్.రంగారెడ్డి తెలిపారు. కాగా దాత జయశంకర్‌రెడ్డిని కర్నూలు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.